క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



నిర్వాహకులకు విరాళం అందజేస్తున్న దాతలు

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం గ్రామంలో శ్రీకృష్ణుడి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మొలగవెల్లి నాగరాజు రూ.1,16,000 విరాళం అందజేశారు. ఆదివారం ఆలయ నిర్వాహకులకు విరాళం అందించారు. ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలు మానవ జీవితంలో ఒక భాగమని దేవున్ని పూజించడం వల్ల ప్రశాంతత కలుగుతుందన్నారు. శ్రీరాములు, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మసీదు నిర్మాణానికి రూ.50వేలు విరాళం

గోనెగండ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంతంలో మసీదు నిర్మాణానికి గంజిహళ్లి బడేసాహెబ్ తాత దర్గా పీఠాధిపతి సయ్యద్ చిన్న ముద్గోల్ ఆదివారం ముస్లిం మత పెద్దలకు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరి సహకారంతో మసీదు నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. ముస్లిం పెద్దలు రఫీక్ హాఫీసా, అల్లబా, ఎస్ఎస్ మాబువలి, ఉస్మాన్, కట్టుబడి షబ్బీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు నష్ట పరిహారం



రైతు లక్ష్మయ్యకు చెక్కును అందజేస్తున్న ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి

కృష్ణగిరి: కటారుకొండ గ్రామానికి చెందిన రైతు లక్ష్మయ్యకు ఫారెస్టు డిపార్ట్‌మెంట్ నుంచి మంజూరైన నష్ట పరిహారం రూ.10 వేల చెక్కును ఆదివారం ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి చేతులమీదుగా అందజేశారు. గ్రామ సమీపంలోని ఫారెస్ట్‌కు అనుకుని రైతు లక్ష్మయ్య పొలం ఉంది. గత ఫిబ్రవరిలో పొలంలో లక్ష్మయ్యకు చెందిన ఆవుదూడను అటవీ జంతువు చంపి తినింది. దీనిపై గ్రామస్తులు ఫారెస్టు అధికారుల ద్వారా జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ చేపట్టిన ఉన్నాతాధికారులు అటవీ జంతువు దాడిలోనే రైతుకు నష్టం జరిగినట్లు గుర్తించి నివేదిక పంపడంతో రూ.10 వేలు నష్టపరిహారం మంజూరైంది. ఆదివారం ఎంపీపీ సమక్షంలో రైతుకు చెక్కును జేసినట్లు వెల్దుర్తి ఫారెస్టు బీట్ అధికారి కలాం తెలిపారు.

గ్రామ సేవకుడి మృతి



తలారి నాగేశప్ప(ఫైల్)

హొళగుంద: హెబ్బటం గ్రామ సేవకుడిగా పనిచేస్తున్న తలారి నాగేశప్ప (55) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. గత కొద్దికాలం నుంచి నాగేశప్ప అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాగేశప్ప మృతికి తహసీల్దారు హుసేన్‌సాహెబ్, డీటీ దీప, ఆర్ఐ దినోజ్ తదితరులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. వీఆర్ఏల సంఘం మండలాధ్యక్షుడు మల్లయ్య, డివిజన్ ఉపాధ్యక్షుడు సిద్దలింగ, మండల ఉపాధ్యక్షుడు మౌలాలి తదితరులు గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించి తక్షణ సహాయం కింద రూ.15 వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడికి భార్య పార్వతమ్మ, ఐదుగురు సంతానం.

నేటి నుంచి ఉత్సవాలు



లింగమేశ్వర స్వామి

ఆస్పరి: మండలంలోని శంకరబండ గ్రామంలో సోమవారం నుంచి లింగమేశ్వర స్వామి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. సోమ, మంగళవారం ఆలయంలో స్వామివారికి గంగ, ఆకు పూజ, అభిషేకం, మంగళహారతులు, బుధవారం స్వామి రథోత్సవం, గురువారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

చంద్ర రాజేశ్వరరావుకు నివాళి

ఎమ్మిగనూరుటౌన్: భూపోరాట యోధుడు, స్వాతంత్ర్య సమరయోధుడైన చంద్ర రాజేశ్వర రావు 29వ వర్ధంతిని స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి నాయకులు సత్యన్న, రంగన్న, బాలరాజులు మాట్లాడారు. చంద్రరాజేశ్వరరావు తన ఆస్తిని సైతం పేదలకు పంచిన త్యాగశీలి అన్నారు. పేదలకు భూముల సాధన కోసం పోరాటాలు చేశారని వివరించారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: భూ పోరాటాల యోధుడు, తొలితరం కమ్యూనిస్టు నేత, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వర రావుకు ఆదివారం స్థానిక సీపీఐ, అనుబంధ సంఘాల నేతలు నివాళులర్పించారు. సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ మండల కార్యదర్శి టి కృష్ణ ఆధ్వర్యంలో చంద్ర రాజేశ్వరరావుకు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాధవకృష్ణ, రాజు, గిరిబాబు, వెంకటేశ్వర్లు, చిన్నమాదులు తదితరులు పాల్గొన్నారు.

తుంపర సేద్యం.. కరువుపై విజయం

- తక్కువ నీటితో పంటల సాగు
- లాభాలు గడిస్తున్న రైతులు
- ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో 10 వేల హెక్టార్లలో డ్రిప్ సేద్యం



పల్లెదొడ్డి గ్రామంలో డ్రిప్ పద్ధతిలో సాగుచేసిన వేరుశనగ

ఆలూరు: వ్యవసాయాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులు పంటల సాగులో కొత్త విధానాలపై దృష్టి సారిస్తున్నారు. ఎప్పటికప్పుడు అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ మంచి దిగుబడులతో లాభాలు గడిస్తున్నారు. నీటి సౌకర్యం తక్కువగా ఉండే వేసవిలో డ్రిప్ (తుంపర్లు) విధానంలో పంటలు సాగు చేస్తూ కరువుపై విజయం సాధిస్తున్నారు. నాణ్యమైన పంట దిగుబడులతో లాభసాటి వ్యవసాయం వైపుగా ప్రయాణిస్తున్నారు.

ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో వర్షాధారం, హెచ్చెల్సీ, ఎల్లెల్సీ కాలువ ద్వారా వచ్చే సాగునీటి ద్వారా ఖరీఫ్‌లో 45 వేల ఎకరాలు, రబీ సీజన్‌లో 35 వేల ఎకరాల్లో రైతులు వివిధ పంటలను సాగు చేస్తారు. ఆలాగే నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 110 చెరువులు ఉన్నాయి. చెరువుల నీటిని వాడుకుని 5 వేల ఎకరాలు, 32 వేల బోరుబావుల కింద 10 వేల ఎకరాలు, హెచ్ఎస్ఎస్ ద్వారా 30 వేల ఎకరాలలో పంటలు సాగవుతున్నాయి. ఆయా వ్యవసాయ సీజన్లు ముగియడంతో పంటల సాగు దాదాపుగా ఉండదు. అయితే చెల్కాసాయిల్, మెట్ట ప్రాంతాలలో బోరు బావులు తవ్వించుకున్న రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసుకుని వేసవిలో తక్కువ నీటితో సేద్యం కొనసాగిస్తున్నారు. ప్రధానంగా వేరుశనగ, పత్తి, మిరప, జామ, మామిడి, టమాట, ఇతర కూరగాయాలు, పండ్ల తోటలను సూక్ష్మ సేద్యం ద్వారా సాగు చేస్తూ లాభాలు పొందుతున్నారు. ఐదెకరాలలోపు పొలం కలిగిన రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో సూక్ష్మ సేద్యం సదుపాయాన్ని కల్పిస్తోంది. 5 నుంచి 10 ఎకరాల భూమి కలిగిన రైతులకు 70 శాతం సబ్సిడీ కింద డ్రిప్ పరికరాలను అందిస్తారు. నియోజకవర్గంలో డ్రిప్ పరికరాల కోసం సుమారు 2,200 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం 220 మంది రైతులకు మెటీరియల్ సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు.

దరఖాస్తులను పరిశీలిస్తున్నాం

ఆలూరు క్లస్టర్ పరిధిలో డ్రిప్ పరికరాల కోసం మంజూరు కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. ఇక్కడి రైతుల ఇబ్బందులను ప్రాజెక్టు డైరెక్టర్ ఏపీఎంఐపీ ఉమాదేవి దృష్టికి తీసుకెళ్లాం. అర్హులైన త్వరలో డ్రిప్ పరికరాలు మంజూరు చేసేలా కృషి చేస్తున్నాం.

– ఇందిర, హార్టికల్చర్ అధికారిణి, ఆలూరు

రైతులకు ఉపయోగం



తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలను సాగు చేసేందుకు సూక్ష్మ సేద్యం మంచి పద్ధతి. పంటలకు సాగు నీరు అందించే సమయంలో బోరు నుంచి వచ్చే నీరు వృథా కాకుండా ఉంటుంది. కాలువలు తెగడం లాంటి సమస్యలు ఉండవు. ప్రతి చుక్క పొలానికి అందించడం ద్వారా పంట దిగుబడి కూడా బాగా వస్తుంది.

– యూసూఫ్, రైతు, దేవనకొండ

తక్కువ నీటితో సాగు



నాకున్న నాలుగెకరాలలో డ్రిప్, స్ప్రింకర్లను అమర్చాను. ఈ పద్ధతిలో పంట సాగుకు తక్కువ నీరు అవసరమవుతుంది. రాత్రిళ్లు, ఉదయం పంటకు నీరు పెట్టేందుకు ఒక్కరు ఉన్నా సరిపోతుంది. కాలానికి అనుగుణంగా వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చే

– వడ్డే కౌలుట్ల, రైతు, పల్లెదొడ్డి గ్రామం

నేటి నుంచి 'జీజీఎంపీ'

తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరిలో 10, 11వ తేదీల్లో, కడమకుంట్లలో 12 నుంచి 14 తేదీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్, సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పుప్పాలదొడ్డిలో సప్త భజన

ఆస్పరి: మండలంలోని కైరుప్పల మజరా గ్రామమైన పుప్పాలదొడ్డి గ్రామంలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు గిడ్డాంజనేయస్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాలలో సప్త భజన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. వర్షాలు బాగా కురిసి, పంటలు పండాలని ఏటా మాదిరిగానే సప్త భజన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని చెప్పారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఏపీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సాజీదా బేగం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 24వ తేదీలోపు https://aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా సాయిబన్నదాదా ఉరుసు



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

హొళగుంద: స్థానికులతో పాటు కర్ణాటక ప్రజల ఆరాధ్య దేవుడిగా వెలుగొందుతున్న హొళగుంద సాయిబన్న దాదా గంధం, ఉరుసు ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఉరుసుకు తరలి వచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు చేసి మొక్కుబడులను చెల్లించుకున్నారు. సంప్రదాయపద్ధతిలో శనివారం అర్ధరాత్రి మేల్‌మరే వంశీకులకు సంబంధించి మంచద మనే నుంచి గంధాన్ని గుర్రంపై ఊరేగింపుగా తీసుకొచ్చారు. భక్తులు దారి పొడువునా కర్రలు, అగ్గి కాగడాలు తిప్పే విన్యాసాలు, బల ప్రదర్శనలు నిర్వహించి అబ్బురపరిచారు. రాత్రి భజన, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ అబ్దుల్‌జహీర్, సిబ్బంది బందోబస్తు చేపట్టారు. సోమవారం జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఎమ్మిగనూరు రూరల్: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని గుడేకల్ – మాసుమాన్‌దొడ్డి గ్రామాల మధ్య వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. పెండింగ్ ఈ-చలానాలు ఉంటే చెల్లించాలని కోరారు. మద్యం సేవించి వాహనం నడపరాదని, ఆటోల్లో నిబంధనలు అతిక్రమించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా విన్సెంట్ ఫెర్రర్ జయంతి



బొల్లవానిపల్లిలో హుండీలో పొదుపుచేసిన సొమ్మును అందిస్తున్న మహిళలు, చిన్నారులు



గజ్జహళ్లిలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటానికి నివాళులరిస్తున్న గ్రామస్తులు

తుగ్గలి: ఆర్డీటీ సంస్థ వ్యవస్థాపకులు విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ జయంతిని ఆదివారం మండలంలోని బొల్లవానిపల్లి, జాఫ్లాతండాలో ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా హుండీలను తెరిచి పొదుపు చేసిన సొమ్మును ఆర్డీటీ ఏరియా టీం లీడర్ రెహనాకు అందజేశారు. ఏరియా పరిధిలో 145 గ్రామాల్లో ఫెర్రర్ జయంతి నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

హొళగుంద: ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అడుగుజాడల్లో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు గజ్జెళ్లి కెంచప్ప, మల్లికార్జున అన్నారు. ఆదివారం గజ్జహళ్లిలో విన్సెంట్ ఫెర్రర్ 103వ జయంతి జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ.. ఫెర్రర్ చేసిన సేవలు, ఆర్డీటీ ద్వారా పేదలకు అందుతున్న పథకాలు తెలియజేశారు. సీబీటీ హెచ్‌వీ అంజినయ్య, సీడీసీ మెంబర్లు ఉలిగమ్మ, ఎలేసమ్మ, లింగమ్మ, లక్ష్మి, మారెమ్మ, పెద్ద కెంచప్ప, రామలింగ, ఈరప్ప పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని నెరుడుప్పల గ్రామంలో ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ జయంతి వేడుకలను ఆర్‌డీటీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఆర్డీటీ ఏటీయల్ సుబ్రమణ్యం మాట్లాడుతూ విన్సెంట్ 'స్పందించు సాయమందించు' నినాదంతో సేవ చేశారన్నారు. స్పెయిన్ నుంచి వచ్చి వెనుకబడిన గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడు, గుడ్డ, నీడ, విద్య, వైద్యం అందించి అభాగ్యులైన వారిని ఆదరించి అనేక సేవలందించారని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఆర్డీటీ సిబ్బంది రామాంజినేయులు, సురేష్, సీడీసీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంచార జాతుల సంక్షేమానికి కృషి



సీనియర్ కార్యకర్త చాంద్‌పీరాను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మిగనూరురూరల్: సంచార జాతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తుందని బీజేపీ ఓబీసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్థసారధి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహశర్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయలో సంచార, అర్ధ సంచార జాతుల వారితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సంచార జాతుల ప్రజలకు ప్రధాని నరేంద్రమోదీ సొంతిల్లు నిర్మించి ఇస్తున్నారని తెలిపారు. ఎటువంటి ఆదరణ లేని సంచార జాతులు రాష్ట్రంలో 75 వరకు ఉన్నాయన్నారు. కేంద్రం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి సంచార జాతులవారి స్థితిగతులను అంచనా వేసి వారి సంక్షేమాభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. రేషన్ కార్డులు మంజూరుచేసి ఎక్కడికి వెళ్లినా రేషన్ తీసుకునేలా అవకాశం కల్పించారని పేర్కొన్నారు.

14వ తేదీ వరకు బీజేపీ ఆవిర్భావ వారోత్సవాలు: భారతీయ జనతా పార్టీ అవిర్భావ వారోత్సవాలను ఈనెల 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగ నరసింహశర్మ, ఓబీసీ జాతీయ కార్యదర్శి డాక్టర్ పార్ధసారధి పేర్కొన్నారు. ఆనాటి జనసంఘ్ పార్టీ (నేటి బీజేపీ)లో పనిచేసి మొదటి కార్యకర్తలుగా ఉన్న చాంద్‌పీరాను స్థానిక బీజేపీ ప్రాంతీయ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఎన్టీడీఎన్టీ రాష్ట్ర అధ్యక్షులు అరబోలు చంద్రశేఖర్, అన్యభాష రాష్ట్ర కన్వీనర్ ప్రకాశ్‌జైన్, బీఎల్ నారాయణ, మాలతి తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానా ప్రారంభమయ్యేనా?



20 ఏళ్లుగా ప్రారంభానికి నోచుకోని షాదీఖానా

వెల్దుర్తి: పట్టణ సమీపంలో నిర్మించిన షాదీఖానా ప్రారంభానికి నోచుకోక తిరిగి శిథిలావస్థకు చేరుకుంటోంది. 20ఏళ్ల క్రితం ఆర్‌కే రోడ్డులో రహదారిని ఆనుకుని షాదీఖానా కొరకు 50 సెంట్ల స్థలాన్ని పట్టణానికి చెందిన వాహబ్ విరాళంగా అందించాడు. 17 ఏళ్ల క్రితమే షాదీఖానా నిర్మాణం పూర్తికాగా రాజకీయ గ్రహణం పట్టి ప్రారంభానికి నోచుకోలేదు. పలుదఫాలు మరమ్మతులకు నోచుకున్నా తిరిగి శిథిలావస్థకు చేరుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. విద్యుత్ సర్వీసు పునరుద్ధరించి, స్వల్ప మరమ్మతులు, కాంపౌండ్ నిర్మించి షాదీఖానా ప్రారంభించే అవకాశాలుండడంతో స్థానిక నాయకులపై ముస్లింలు గంపెడాశతో ఎదురుచూస్తున్నారు.

సంక్షేమ పాలనకే జనామోదం





ఎమ్మిగనూరు 21వ వార్డులో సంక్షేమ పథకాలపై ఆరా తీస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గంజిహళ్లిలో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ఆదివారం పట్టణంలో ఉత్సాహంగా కొనసాగింది. ఆయా వార్డుల్లో వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఇళ్లలో కొద్ది సేపు కూర్చొని యోగక్షేమాలు తెలుసుకుంటూ వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటూ ఇళ్లకు స్టిక్కర్లను అతికిస్తూ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కామర్తి నాగేషప్ప, బుట్టారంగయ్య, వాహిద్, ఇషాక్, అమాన్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: సంక్షేమ క్యాలెండర్ ప్రకటించి నాలుగేళ్లుగా తేదీల వారీగా పథకాలను అందిస్తున్న 'జగనన్నే మా భవిష్యత్తు' అని ప్రజలు తేల్చి చెబుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి, పార్టీ యూత్ కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి, శిగరమాను కృష్ణమూర్తి అన్నారు. మండల పరిధిలోని జి.మల్లాపురం, కంబాలపాడు, చుంచుఎర్రగుడి తదితర గ్రామాల్లో ఆదివారం ఆయా గ్రామాల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలను సేకరించారు. ప్రభుత్వ పాలన పట్ల సంతృప్తికరంగా ఉన్న వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించి వారి సెల్‌ఫోన్ల నుంచి మిస్డ్‌కాల్ ఇప్పించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రం నందవరంతో పాటు జొహరాపురం, సోమలగూడూరు, నాగలదిన్నె, ముగతి, హాలహర్వి తదితర గ్రామాల్లో ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికీ ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు.

హొళగుంద: మండల కేంద్రంతో పాటు గజ్జహళ్లి, నెరణికి తదితర గ్రామాలలో ఆదివారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ షఫీవుల్లా, నాయకులు ఈశా, హనుమప్ప, ఫజల్, బకాడి శంక్రి, ఎంపీటీసీ మల్లికార్జున, తదితరులు ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో తేడా వివరిస్తూ ప్రతి కుటుంబాన్ని కలిసి వారి అభిప్రాయాలను నమోదు చేసుకున్నారు.

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని దూదేకొండ గ్రామంలో సర్పంచ్ రహిమాన్ ఆధ్వర్యంలో గృహసారథులతో కలిసి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, నాటి చంద్రబాబు ప్రభుత్వానికి తేడాను వివరిస్తూ జగనన్నకు మద్దతు తెలిపిన వారి ఇంటి గోడలకు స్టిక్కర్లు అతికించారు.

గోనెగండ్ల: మండలంలోని గోనెగండ్ల, గంజిహళ్లి, అలువాల, పెద్దమరివీడు తదితర గ్రామాల్లో వైస్ ఎంపీపీ అలువాల వెంకట్రామిరెడ్డి, ఆయా గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి గల తేడాను వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికు మద్దతుగా నిలవాలని కోరారు. పింఛన్ సక్రమంగా అందుతుందా అని ఆరాతీయగా తమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతినెలా 1వ తేదీన ఇంటి వద్దకే పింఛన్ తెచ్చి ఇస్తున్నారని పేర్కొంటూ వృద్ధులు గోడకు అతికించిన వైఎస్ జగన్ స్టిక్కర్‌కు చేతులెత్తి మొక్కారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, పెరవలి, బసినేపల్లి గ్రామాలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎంపీపీ అనిత, మార్కెట్ యార్డు డైరెక్టర్ భద్రయ్య, ఉపసర్పంచ్ ఆముదాల గోపాల్ తదితరులు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రచారం చేసి స్టిక్కర్లను అతికించారు.



అలువాలలో గోడకు అతికించిన సీఎం జగన్ స్టిక్కర్‌కు మొక్కతున్న వృద్ధురాలు

తుగ్గలి: జీ.ఎర్రగుడిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్‌యాదవ్, సచివాలయ కన్వీనర్ దేవేంద్రారెడ్డి ఆధ్వర్యంలో గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును లబ్ధిదారులకు తెలియజేశారు. మరోసారి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

ఆస్పరి: మేజర్ గ్రామ పంచాయతీ ఆస్పరిలో గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, సర్పంచ్ మూలింటి రాధమ్మ, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు దొర బాబు, మండల సొసైటీ చైర్మన్ కట్టెల గోవర్ధన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించి సర్వే నిర్వహించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

హొళగుంద: మండల కేంద్రంలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచితంగా దంత పరీక్షలు, వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలతో పాటు మందులు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

దేవరగట్టులో పూజలు

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారం సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జలాభిషేకం, మహా మంగళహారతి, సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిని దర్శించుకునేందుకు కర్ణాటక, ఆంధ్రా ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కొందరు భక్తులు మొక్కులో భాగంగా భక్తులకు, అనాథలకు అన్నదానం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

నిరుపయోగంగా బస్‌షెల్టర్



మద్దికెర: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ ఉన్న చోట బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు సమీపంలో చెట్ల కింద సేద తీరుతూ వేచి చూస్తున్నారు. అసలే ఎండలు విపరీతంగా ఉండడంతో చిన్నపిల్లలతో ఎక్కడ నీడ ఉంటే అక్కడకు వెళుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలు జనం ఉన్న చోటే నిలుపుతుండడంతో బస్సులు కూడా అక్కడే ఆపుతున్నారు. దీంతో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన బస్సు షెల్టర్ నిరుపయోగంగా మారింది.

నేడు వాహనాల వేలం

ఆలూరు రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను సోమవారం మధ్యాహ్నం 1 గంటకు ఆలూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు సీఐ ఈశ్వరయ్య ఆదివారం ప్రకటనలో వెల్లడించారు. పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ సమక్షంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి పోలీసు స్టేషన్లలో సీజ్ చేసిన 85 వాహనాలను వేలం వేయనున్నట్లు ప్రకటించారు. ఇందులో ఒక ఫోర్ వీలర్, మూడు త్రీవీలర్ వాహనాలు, 82 స్కూటర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

వెల్దుర్తి: ఏసు ప్రభువు పునరుత్థాన పండుగ ఈస్టర్‌ను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. తమ దైవం ఏసు తిరిగి జీవించి వచ్చిన వేళ పురస్కరించుకుని చర్చిలలో ప్రార్థనలు, కీర్తనలు నిర్వహించారు. స్థానిక ఏబీఎం చర్చి భక్తులతో కిక్కిరిసింది. రెవరెండ్ సీ ఏసేపు ఆధ్వర్యంలో వీరన్నగట్టు కొండపై ఏర్పాటైన భారీ శిలువ వద్ద ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం ఏసును కీర్తిస్తూ కొత్తబస్టాండు, పాతబస్టాండు, మెయిన్ బజారు గుండా ర్యాలీ నిర్వహించారు. సంఘం ప్రతినిధులు జెడ్పీటీసీ సుంకన్న, తిమ్మోతి, సంఘపెద్దలు పౌలు, మనోరాజు, నాగరాజు, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మానవాళి పాప పరిహారార్థం కోసం ఈ లోకానికి వచ్చిన ప్రభువు సిలువనెక్కి తిరిగి జన్మించిన లోక రక్షకుడు ఏసు ప్రభువని పాస్టర్లు శాంతన్న, ఇజ్రాయిల్, శాంతమూర్తి అన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక పార్థనలు చేశారు.

నందవరం: శిలువ మరణం పొంది మూడవ రోజు సమాధి నుంచి లేచి యేసుక్రీస్తు మరణాన్ని జయించారని గంగవరం ఫాదర్ రెవ. జె జీవన్‌బాబు, నాగలదిన్నె రెవరెండ్ బీఏ ప్రసాద్ ఉపదేశించారు. ఆదివారం మండలంలోని గంగవరం, సంజీవపురం, నాగలదిన్నె, గురజాల, సోమాలగూడురు, కనకవీడు, నందవరం, ముగతి, ఇబ్రహీంపురం, మాచాపురం ఆయా గ్రామాల్లోని ప్రార్థన మందిరాలలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి ప్రదర్శనలు నిర్వహించారు.



గంగవరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ఎస్‌హెచ్ ఎర్రగుడి చర్చిలో ప్రార్థన చేస్తున్న దృశ్యం

తుగ్గలి: తన పునరుత్థానంతో తానే జీవమునని క్రీస్తు ప్రపంచానికి చాటారని పాస్టర్లు క్రాంతికుమార్ సువర్ణరావు, సుధాకరరావు అన్నారు. ఈస్టర్ సందర్భంగా ఆదివారం జొన్నగిరి, తుగ్గలితో పాటు పలు గ్రామాల చర్చిలలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. క్రైస్తవ గురువులు ఈస్టర్ విశేషాలను వివరించారు. కక్ష, ద్వేషాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ప్రేమమయ జీవితాలను కలిగి ఉండాలన్నారు.



వెల్దుర్తి పురవీధులలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు